త్వరలో నిరంకుశ పాలనకు తెర

- రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయి
- సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం
- బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్
- పలు పార్టీలకు చెందిన నాయకులు బీజేపీలో చేరిక



ఇందిరనగర్-ఏలో మహిళలతో సమావేశమైన బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్.



జగద్గిరిగుట్ట రింగ్ బస్తీలో బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కూన శ్రీశైలంగౌడ్.

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు త్వరలోనే మంచి రోజులు రానున్నాయని, తొమ్మిదేళ్ల నిరంకుశ పాలనకు తెరపడనుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట రింగ్ బస్తీకి చెందిన నిఖిల్‌సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన అనంతరం శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ అవినీతిలో కూరుకుపోయిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో బొంద పెట్టాలని, కుత్బుల్లాపూర్‌లో బీజేపీని గెలిపించి ప్రధాని నరేంద్రమోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, పథకాల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే సంక్షేమ పథకాలకు పెద్ద పీట వస్తామన్నారు. అరుణ్ సింగ్ లాల్, లాల్ సింగ్, యుగేందర్, అశోక్ సింగ్, నితీష్ పాండే, సునీల్ సింగ్ ఎల్లా సింగ్, బసవరాజ్ ,సంతోష్ సునీల్ రన్వీర్ సింగ్ పప్పు రూప్ సింగ్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేకే శేఖర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పున్నారెడ్డి, నాయకులు హనుమాన్ కచవా, సురేష్ రెడ్డి, అరకల సుధా, మహేందర్, వసుంధర, గండి రాజు యాదవ్, మాధవులు, నరేష్ గౌడ్, అరుణ రెడ్డి తదితరులు ఉన్నారు.

సేవ చేసే అవకాశం ఇవ్వండి

◆ గాజులరామారం డివిజన్ ఇందిరానగర్ (ఏ) లో కుత్బుల్లాపూర్ బస్తీ వాసులతో శ్రీశైలంగౌడ్ సమావేశమయ్యారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, మరోసారి ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని కోరారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. బీజేపీ నాయకులు కోటకృష్ణ, అశోక్, యాదగిరి, సుధాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యూహంపై సమీక్ష

◆ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలతో శ్రీశైలంగౌడ్ సమావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచారంపై దిశానిర్దేశనం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిపై ప్రజలకు వివరించి బీజేపీ వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలని సూచించారు.

◆ జీడిమెట్ల డివిజన్ సుచిత్ర పరిధిలోని రత్న ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ వాసులతో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. కాలనీ వాసులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ, నరసింహారెడ్డి, సంపత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలకు దిశానిర్దేశనం చేస్తున్న శ్రీశైలంగౌడ్



బీజేపీ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్న రత్న ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ వాసులు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: ఎన్నికల్లో అవకతవకలు జరుగకుండా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్, ఎన్నికల అధికారి విజయేందర్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి కేటాయించిన 950 మంది ప్రొసీడింగ్ అధికారులకు రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులు శనివారం సుచిత్ర సర్కిల్ సమీపంలోని లయోలా జూనియర్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 200 మంది అధికారులు హాజరు కాగా వారికి ఎన్నికల నిబంధనలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ పర్యవేక్షించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి..



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీధర్‌వర్మ, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి, నాయకులు ప్రతాప్, విశాల్‌గౌడ్

కుత్బుల్లాపూర్: తెలంగాణాలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కుత్బుల్లాపూర్ నియోకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం గాజులరామారం డివిజన్ బీజేపీ కంటెస్టెడ్ అభ్యర్థి శ్రీధర్ వర్మ తన అనుచరులతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. డివిజన్‌లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె.ఎం.ప్రతాప్, కేపీ విశాల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ‘శివశివాని’ స్నాతకోత్సవం



స్నాతకోత్సవానికి హాజరైన ప్రముఖులు



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివశివాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం 28వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ నిరంజన్‌రెడ్డి, విశిష్ట అతిథిగా ఇన్సూరెన్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఫ్యాకల్టీ అరుణ్‌కుమార్ హాజరయ్యారు. శివశివాని విద్యా సంస్థల ప్రెసిడెంట్ ఆరతి సంపతితో కలిసి 120 విద్యార్థులకు పట్టాలు అందజేశారు. పలువురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలున్నాయని, ఎక్కడికి వెళ్లినా కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శైలేష్ సంపతి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ దీపిక సంపతి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి.రమణ రావు తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు రెండు నామినేషన్లు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రెండోరోజు రెండు నామినేషన్లు వేశారు. దీంతో నామినేషన్ల సంఖ్య మూడుకు చేరింది. శనివారం చందానగర్ డివిజన్ కైలాష్‌నగర్‌కు చెందిన ఆకాష్ శ్రీరామోజు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అలాగే శేరిలింగంపల్లి డివిజన్‌లోని నెహ్రూనగర్‌కు చెందిన మహ్మద్ పాషా నామినేషన్ వేశారు. ఇద్దరు పదిమంది ప్రతిపాదితులతో నామినేషన్ వేసినట్లు ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఆర్ట్‌గ్యాలరీలో చిత్రప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో కళాకారుడు ఆర్.సుభాష్‌బాబు వేసిన చిత్రాలను ప్రొఫెషియన్సీ విత్ జీల్ పేరిట శనివారం చిత్రప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను మాజీ మంత్రి ఎం.ఎం.పి.రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తాయని కొనియాడారు. ఈనెల 8వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న కిమ్స్, సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు..

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ పరిధిలోని దూలపల్లి జడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో కిమ్స్, సన్ షైన్ ఆస్పత్రి సౌజన్యంతో గ్రామానికి చెందిన గంగయ్య రాకేష్, శివకుమార్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ. గైనకాలజీ, చెవి, ముక్కు, కన్ను తదితర సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాకేష్, శివకుమార్ మాట్లాడుతూ సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ శ్రీధర్ కస్తూరి సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరానికి మంచి స్పందన లభించిందని, త్వరలో మరికొన్ని ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు జగదీష్ చంద్ర, శ్రీనాథ్, కోఆప్షన్ నెంబర్ గంగయ్యల వెంకటేష్, బూరుబావి సత్యనారాయణ, గంగయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం



భూమిపూజలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి

దుండిగల్: యువకులు ఐకమత్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలో నూతనంగా నిర్మించనున్న యువ జన సంఘం భవన నిర్మాణ పనులకు శనివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ యువ జన సంఘ వ్యవస్థాపక సభ్యుడిగా తన పూర్తి సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పోరెడ్డి సుధాకర్‌రెడ్డి, పి.గోపాల్‌రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



విశ్వరూప మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

రంగారెడ్డినగర్: ఎస్సీవర్గీకరణ బిల్లుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించి మాదిగలు, ఉప కులాలకు న్యాయం చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాదగిరి మాదిగ అన్నారు. శనివారం షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్ వద్ద ఈ నెల 11న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభ పోస్టర్‌ను జిల్లా నాయకుడు సిలివేరు శ్రీనివాస్ మాదిగతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 29 ఏళ్లుగా వర్గీకరణ సాధనకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తున్నామన్నారు. ఈ సభకు ప్రధాని నరేంద్రమోడీ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ వేదికపై ప్రధాని స్పష్టమైన హామీ ఇవ్వనున్నారన్నారు. వేలాదిగా మాదిగలు, ఉప కులాల ప్రజలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు తిరుపతి మాదిగ, రమేష్ మాదిగ, నరసింహులు, రాజు, కిరణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధి



ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుతో నాగిళ్ల శ్రీనివాస్, చౌడ శ్రీనివాస్‌రావు



బీఆర్‌ఎస్‌లో చేరిన మహిళలు

- బీఆర్‌ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ ఖాయం
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్
- పలు సంఘాల మద్దతు
- వివిధ పార్టీలకు చెందిన నేతల చేరిక

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అని, ముచ్చటగా మూడోసారి తమ ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం దుండిగల్ మున్సిపల్ పరిధి, గండిమైసమ్మ చౌరస్తాలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో టీఎస్‌కేబీ ఆటోస్టాండ్ డ్రైవర్లు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు పన్ను రద్దు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్మిక, కర్షకుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, సాయిలు యాదవ్, మహేందర్ యాదవ్, దుండిగల్ మున్సిపాలిటీ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొల్తూరి మల్లేష్ ముదిరాజ్, మేడ్చల్ జిల్లా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవి యాదవ్, దుండిగల్ గ్రామ మాజీ సర్పంచ్ గణేష్, వ్యవసాయ సొసైటీ సభ్యులు వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సూరారం నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివ కుమార్ అధ్యక్షతన శివాలయ నగర్‌లోని అంబేడ్కర్ భవన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద్‌కు 129, 130 డివిజన్లకు చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మాన పత్రాలను అందజేశారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ , మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

◆ సూరారం డివిజన్ సూరారం పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీ.ఎస్.ఐ.ఐ.సీ కాలనీ లోని సీనియర్ సిటిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతు తెలుపుతూ పార్టీలో చేరారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్ధిక్ , చక్క సురేష్, నేతి రాజా, సాయి బాబా, ముకుందం, రాజేశ్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ గాజులరామారం డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో మక్కేన లక్ష్మి, ఆసియా బేగం, ఎస్. కళ, నఫీజ్ బేగం, రోహదా బేగం, షబానా బేగం, భాను బేగం, నజియా బేగంల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే వివేకానంద్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు విజయరామ్ రెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, కమలాకర్, పరుశ శ్రీనివాస్, నవాబ్, సింగారం మల్లేష్, మనీ, మంజుల, దుర్గ, ఊర్మిళ, ఫైజాన బేగం, సంధ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ బీఆర్‌ఎస్ నాయకులు నాగిళ్ల శ్రీనివాస్, చౌడ శ్రీనివాస్‌రావులను బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ కలిసి పార్టీలోకి ఆహ్వానించిన నేపథ్యంలో శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వారితో సమావేశమయ్యారు. వారిరువురూ బీఆర్‌ఎస్‌లో కొనసాగుతారని రాజు స్పష్టం చేశారు.



ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆటో యూనియన్ నాయకులు



తీర్మాన పత్రాలను అందజేస్తున్న పాస్టర్స్ సంఘం



ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతుగా తీర్మాన పత్రాలు అందజేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు

చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి

దుండిగల్: చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని దుండిగల్ మున్సిపల్ మేనేజర్ టి.నర్సింహులు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది క్రమం తప్పకుండా ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, రోడ్డు పక్కన, ఖాళీ ప్రదేశాలు, ప్రధాన రహదారులపై ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మహిళా గ్రూపు రిసోర్స్ పర్సన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ చర్యలు పాటించాలి



పనులను పర్యవేక్షిస్తున్న డీజీఎం రాజేష్, మేనేజర్ రాజు

చింతల్: మ్యాన్‌హోళ్లలో సిబ్బంది మురుగు వ్యర్థాలను తొలగించే సమయంలో తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించాలని చింతల్ వాటర్ వర్క్స్ డీజీఎం రాజేష్ అన్నారు. జీడిమెట్ల సెక్షన్ పరిధిలో శనివారం ఆయన మేనేజర్ రాజుతో కలిసి జెట్టింగ్ మిషన్ల ద్వారా వ్యర్థాల తొలగింపు పనులకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేట్‌బషీరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు కొంతమేర లోతుగా ఉండటంతో సిబ్బంది రక్షణ పరికరాలు ధరించిన తర్వాతే వ్యర్థాలను తొలగించడానికి సమాయత్తం కావాలని సూచించారు. రక్షణ పరికరాలు లేకుండా ఎవరైనా సిబ్బంది విధులకు హాజరైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సుమధుర సంగీత స్వరధార సంగీత విభావరి, తిల్లాన ఆర్ట్స్ అకాడమి గురువు మాధవి మారెళ్ళపూడి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇందులో మంగళం , జయ జయ స్వామిన్, ఆండాల్‌కౌత్వం, నటనమాడిన, భరో కృష్ణయ్య,సింహాసన స్తుతి, కీర్తన, గోప బాల, తిల్లాన తదితర అంశాలను అభా, ఆస్మీ, ఆర్య, అజ్ఞ, చేతన, సాయి, వేదాంశీ, సమృద్ధి, స్వేచ్ఛ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సుభాష్‌నగర్: శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి దొంగలు ఇంటిని దోచేసిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శివాలయం నగర్‌కు చెందిన సలీం శుక్రవారం కుటుంబంతో సహా తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.35 వేల నగదు, 4గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు





హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామి వారి అష్టవింశ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు జగద్గురు స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి మహాస్వామిలచే అష్టవింశ బ్రహ్మోత్సవాలను అట్టహాసంగా ప్రారంభించారు. ఉదయం 10.30 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, మధ్యాహ్నం 12 గంటలకు తీర్థప్రసాదాలు అందించారు.

స్వరూపానందేంద్ర స్వామిని కలిసిన సీఎస్ శాంతికుమారి

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారి జగద్గురు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, ఉత్తర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి మహాస్వాములను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. రాజశ్యామల అమ్మవారి వస్త్రాలను పీఠాధిపతుల చేతులమీదుగా ఆమె అందుకున్నారు.

నేడు బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం బాల బృందావనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ‘ఆటిట్యూడ్ ఆఫ్ గ్రాటిట్యూడ్’ అనే అంశంపై ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 9 ఏళ్ళ నుంచి 14 ఏళ్ళ లోపు విద్యార్థులు పాల్గొన వచ్చని నిర్వాహకులు తెలిపారు.

అన్నమయ్య స్వరార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం తెలుగువన్.కామ్ రేడియో జాకి హిమబిందు ఆధ్వర్యంలో బిజిబెస్ లర్నింగ్ సెంటర్ ద్వారా సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, స్తోత్ర పఠనం గురువులతో పాటు శిష్యులు సునిల్, విఖ్యాత్, ఇందిరా, మిహిర, తన్విక, సమయ, మీర, చక్రిక, అశ్విని, శ్రీరామచంద్ర తదితరులు పాల్గొని కీర్తనలను ఆలపించారు.